అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ పాత బస్తీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన కాలనీలో పర్యటించి భూగర్భ నాలా విస్తరణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయా కాలనీలు, బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, రోజారెడ్డి, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, రాజు, కల్పన, అనసూయ, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

'సర్వే' ఫారాల భద్రతలో నిర్లక్ష్యం వహించొద్దు



డీసీ జయంత్

చాదర్‌ఘాట్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు పూరించిన ఫారాల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మలక్‌పేట నోడల్ అధికారి డీసీ జయంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ఎన్యుమరేటర్లు పూరించిన ఫారాలను ఎప్పటికప్పుడు భద్రపర్చాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆపరేటర్లతో వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయించాలని సూచించారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు షాదీ ముబారక్ పథకం వరం లాంటిదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పలువురికి మంజూరైన షాదీముబారక్ చెక్కులను సోమవారం పంజేషా క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిహారిక, స్పెషల్ ఆర్‌ఐ అక్బర్ అలీఖాన్, ఆర్‌ఐ రిజ్వాన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్

నాగోలు: క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీ సిద్ధార్థ మోడల్ హైస్కూల్ ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. కష్టపడి చదివి పాఠశాలతో పాటు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

రోడ్డు కబ్జాపై ఫిర్యాదు



డీసీకి ఫిర్యాదు చేస్తున్న యాదయ్య చారి

లింగోజిగూడ: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీ ఫేజ్–2లోని 40 ఫీట్ల రోడ్డుకు అనుకుని ఓ వ్యక్తి తన ఇంటి ర్యాంప్‌ను నిర్మించాడని సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యను కలిసి యాదయ్య చారి ఫిర్యాదు చేశారు.

పర్యవేక్షణ లేక.. తరలించే వారు రాక!

- కంపు కొడుతున్న కాలనీలు
- పట్టించుకోని అధికారులు



హస్తినాపురం సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త

హస్తినాపురం: అధికారుల పర్యవేక్షణ లేక కాలనీలు, బస్తీల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ ప్రధాన రహదారి పక్కన, పిండినారాయణరెడ్డి కాలనీ, ఫేజ్–2లో గత కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోయినా తరలించే నాథులే లేరని వాపోతున్నారు. పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో అందులో నుంచి దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారంలో మురుగు నీరు చేరి భరించలేని కంపు వస్తోందని దీనికి తోడు దుర్గంధంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

హస్తినాపురంలో పడకేసిన పారిశుద్ధ్యం



పిండినారాయణరెడ్డికాలనీలో..

దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి..

స్థానికంగా ఉన్న కొంతమంది ఇష్టానుసారంగా రోడ్ల పక్కన ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారాలను పారవేయడంతో రోగాలు వ్యాపించడమే కాకుండా మూగజీవాలు వాటిని తింటూ అనారోగ్యం బారిన పడుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త, వ్యర్థాలను తరలించాలని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తలో నుంచి వచ్చే దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఉన్నతాధికారులు స్పందించి కాలనీల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..



హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను వెంటనే తొలగించాలి. చాలా ప్రాంతాలలోని ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నా వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోతే ఇంకెవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదు.

పి.నరేశ్‌యాదవ్–దీనబంధు సేవాసమితి అధ్యక్షుడు

తొలగించి వదిలేశారు..



ప్రభాత్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన పడేసిన చెట్ల కొమ్మలు

చైతన్యపురి: విద్యుత్ తీగలకు తగులుతున్నాయనే కారణంతో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది వాటిని తరలించకుండా ఎక్కడికక్కడే వదిలేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీలో కొన్ని రోజుల క్రితం చెట్ల కొమ్మలను తొలగించారు. రోజుల తరబడి అక్కడే వదిలేయడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. దీనికి తోడు రాకపోకలు సాగించే సమయంలో వాహనాలకు తగలి ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తొలగించిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

పద్మావతి కాలేజ్, ఇంద్రప్రస్థ ఫేజ్–2, సుబ్రహ్మణ్యానగర్, కరణ్‌బాగ్, సీ–క్వార్టర్స్, ముంతాజ్ కాలేజ్ క్రాస్‌రోడ్, హనుమాన్ టెంపుల్, మటన్ మార్కెట్, రాణిబాగ్, ఇదారా ఏ మిలియా మజీద్, బాదం గల్లీ, వాటర్ పంప్ హౌజ్, పద్మానగర్.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

సైదాబాద్ వెంగళరావ్ పీటీ, సైదాబాద్ రామాలయం, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, సాయిబాబా టెంపుల్, ఎంసీ కాలనీ, రామాలయం, ఎస్‌బీహెచ్ కాలనీ, ఆస్మాన్‌గఢ్ వాటర్‌వర్క్స్, మలక్‌పేట పీఎస్, మహిళా మండలి, బీబ్లాక్, హమాలీ బస్తీ, వెంకటాద్రి నగర్, ఫకీరీ గల్లీ, జమాల్ కాలనీ, పోచమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

చంపాపేట సబ్ స్టేషన్ పరిధిలో..

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని దుర్గాభవానీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు సంతోష్‌నగర్, సెంట్రల్‌ఎక్స్ఛేంజ్, డీఎస్‌నగర్, రోషన్ విహార్, ముస్తేంబస్తీ, మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్, సుల్తానాఅల్వా కాలనీలు. మ. 2 గంటల నుంచి సా. 4 వరకు పోచమ్మగడ్డ ఫీడర్ పరిధిలో పోచమ్మగడ్డ, అంబేద్కర్‌వాడ, ఈస్ట్ మారుతీనగర్, లక్ష్మారెడ్డి గార్డెన్, హనుమాన్ ఆలయ పరిధి, చిలుకల బస్తీ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మన్సూరాబాద్: కార్తీక మాస సోమవారం పురస్కరించుకుని ఎల్‌బీనగర్‌లోని పలు శైవ క్షేత్రాలు భక్తుల సందడితో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. భక్తులు ఆలయాల ఎదుట కార్తీక దీపారాధన చేశారు.

నేడు కార్తీక మాస పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్, సరూర్‌నగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణపురం పార్కులో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఉసిరి చెట్టుపూజ, గోపూజ, శ్రీ అశ్వత్థ లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, ప్రసాద వితరణ ఉంటుందని కాలనీ సొసైటీ ప్రధాన కార్యదర్శి రామారావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నాగోలు: తెలంగాణ ఫ్రూట్ మార్కెట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మామిడి సీజన్‌లో బాటసింగారం మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కోహెడకు తరలించి అక్కడ తాత్కాలిక షెడ్లను నిర్మించి ఏజెంట్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో మహ్మద్ అంజద్, క్రాంతి ప్రభత్, సయ్యద్ ఇమ్రాన్ అలీ, అనిల్‌కుమార్, నాగరాజు, మహ్మద్ అబ్దుల్ రహీం, అశ్రఫ్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

24న మలక్‌పేటలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఆదివారం గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్, అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ కాలేజీ చౌరస్తాలో సాయంత్రం 4 గంటలకు సెలబ్రేషన్స్ జరుగుతాయని పాస్టర్లు బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

నాగోలు: నాగోలు చెరువు సమీపంలోని ఈదమ్మ మాత దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు మంగళ, బుధవారంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం గణపతిపూజ, గంగపూజ, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, అంకురారోపణ, నవగ్రహపూజ, జోడు బోనాల సమర్పణ మండప దేవత పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లింగోజిగూడ: హయత్‌నగర్ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం(నేడు) ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ అధ్యక్షులు నర్సయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగే శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నియామకం

మలక్‌పేట: తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా మూసారంబాగ్ కట్టెల మండి ఎస్సీ హాస్టల్‌కు చెందిన మేడి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

గుడిసె వాసులకు పట్టాలు మంజూరు చేయండి

- ప్రజావాణిలో సీపీఐ నేతల వినతి



ప్రజావాణిలో ఇచ్చిన వినతి పత్రాన్ని చూపుతున్న షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ, నీలం సంజీవయ్యనగర్, ఖాజాబాగ్ బస్తీలలోని గుడిసెవాసులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు సీపీఐ నేతలతో కలిసి సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా బస్తీలలో మూడు దశాబ్దాలుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. మూడు బస్తీలలో నివసించే వారికి ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డు వంటి ప్రభుత్వం జారీ చేసిన అన్నిరకాల పత్రాలు ఉన్నాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి మంత్రి కేటీఆర్ ఇక్కడ పర్యటించి పట్టాల సమస్య పరిష్కరిస్తానని విస్మరించారని విమర్శించారు. ఇప్పటి ప్రజాప్రతినిధులు సైతం గుడిసెవాసుల ప్రధాన సమస్య పరిష్కరించడంపై ఆసక్తి చూపడం లేదని ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని గుడిసెవాసుల ప్రధాన సమస్య అయిన పట్టాల మంజూరు విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు సక్రిబాయ్, జంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



పూజలో పాల్గొన్న కిచ్చనగారి లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ విజయ రామాలయంలో మాజీ మార్కెట్ చైర్మన్ మహేందర్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రవీంద్ర, శివప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, కిషోర్, రఘుపతి, భాస్కర్, సైదులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. రూ. 27, వంకాయ రూ.45, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 35, కాకర రూ. 23, బీర రూ. 38, క్యాబేజి రూ. 30, ఫ్రెంచి బీన్స్ రూ. 53, క్యారెట్ రూ. 65, దొండ రూ. 23–35, చిక్కుడు రూ. 35–60, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 55, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 37, దోస రూ. 33, సొర రూ. 15, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 40, చామగడ్డ రూ. 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.







ఆకర్శించే కూడళ్లు.. అందంగా గోడలు

నగర సుందరీకరణలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు నల్గొండ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన జిరాఫీలు, డైనోసార్ జంతువుల కళాకృతులు చూపరులను ఆకర్షిస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు, ట్రాఫిక్ సిగ్నల్స్ పడినప్పుడు వాటిని ఆసక్తిగా చూస్తున్నారు. ఓల్డ్‌మలక్‌పేట పలు కాలనీల్లో పురాతన గోడలకు వేసిన ప్రకృతి అందాలు, మైమరిపించే బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

– చాదర్‌ఘాట్